

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... “ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను” అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

## ప్రేమపావురాలు

మనుషులకి అసలు ఊరికే ఉంటే తోచదు కాబోలు. ప్రతి నెలా ఏదో ఒక సంబరాల పేరిట ఏదో ఒక హడావిడి. సందట్లో సడేమియా లాగా ఈ సంబరాల కోసం వస్తువులు కొనుట, డబ్బులు వదిలించుకొనుట. ఇవి వీటి యొక్క సైడ్ ఎఫెక్ట్స్. ఇంత తెలిసీ ఏ ఒక్క విశేషాన్నయినా పోస్టుపోన్ చేస్తానా అంటే, ఆబ్బె ... అస్సలా!. ఇంటిలో ధ్యానం చేసి సంపాదించుకున్న నిగ్రహం అంతా షాప్ కెళ్ళేసరికి మటుమాయం. ఒకవేళ మనం మరచినా షాప్ వాళ్ళు మరువనిస్తారా? స్పెషల్ థీమ్ లనీ , అవని ఇవనీ ఒకటే ఊరిస్తారు. నన్నడిగితే స్థితప్రజ్ఞత అంటే ఏవిటిరా అంటే, "పాల క్యాను, కోడిగుడ్ల

కోసం షాపులోకి వెళ్లి, అవి మాత్రమే కొని, చివరికి కౌంటర్ లో ఇచ్చే ఫ్రీ కాండీల వైపు కనీసం చూడనైనా చూడకుండా ఎవడైతే వస్తాడో, వాడే అర్జునుడి తర్వాత అంతటి స్థితప్రజ్ఞుడు."

లేకపోతే ఏవిటీ, థాంక్స్ గివింగ్ దాటేసానా?, బ్లాక్ ఫ్రైడే ఈదేసానా ? క్రిస్మస్ ఊదేసానా ? న్యూ ఇయర్ తేల్చేసానా ?...ఇన్ని దాటుకుని వచ్చి హమ్మయ్య అనుకునేలోపు మళ్ళీ ఇంకోటి... అసలు బుర్రకి మనసుకి తీరిక ఇవ్వరు కదా?

డాలర్ స్టోర్ నుండి డొమినోస్ వరకు, Macys (సర్వం సమస్తం దొరకు పెద్ద షాపు) నుండి మెక్ డొనాల్డ్స్ వరకు, టార్గెట్ (ఇంకో మాయాబజార్) నుండి టాకో బెల్ వరకు... వాల్ మార్ట్, వాల్ గ్రీన్స్ ఒక్కటేమిటి ఎక్కడికి వెళ్లినా అంతా ప్రేమ మయం. వాలెంటైన్స్ డే వస్తోంది కదా. ఆ ...మనకెందుకులే అనుకోడానికి వీల్లేదు ఇక్కడ. చిన్న పెద్దా, ముసలీ ముతకా అంతా ఎంతో ఉల్లాసంగా, ఉత్సంహంగా బహుమతులు కొంటూ ఉంటారు. బుజ్జి బుజ్జి గిఫ్ట్స్ చూస్తూ ఉండలేము, వదిలి రాలేము. డైపర్ల కోసం టార్గెట్ కి వెళ్లి గంట సేపు విండో షాపింగ్ చేసి వేరే ఏమీ కొనకుండా గర్వంగా బయటికి వచ్చేసా. ఈరోజుకి ఈ అఛీవ్మెంట్ చాల్లే అనుకుంటుండగా వాట్స్ ఆప్ లో మథర్స్ గ్రూప్ నుండి మెసేజ్. మధ్యాహ్నం గెట్ టుగెదర్ కోసం. ఐదేళ్ల వరకూ పిలకాయలకి బడి తెరవరు. పోనీ ప్లే స్కూల్ లో వేద్దామంటే ఆస్తులు అడుగుతున్నారు. ఇలాక్కాదని ఓ నలుగురు అమ్మలం ఒక గ్రూప్ కింద చేరి, వారానికి ఒకరింటికి పిల్లల్ని తీస్కుని వెడితే అక్కడ పిల్లలు ఆడుకుంటూ ఉంటారని మా ఆలోచన.

చెప్పాను కదా, సుఖాలతో వచ్చే పాటూ వచ్చే కొన్ని కష్టాలు ఇవి. మనుషులకి మనుషుల కరువు, పిల్లలకి పిల్లల కరువు. కానీ ప్రతీ దానికీ ఒక పరిష్కారం కూడా ఉంటుంది. కాకపోతే మా గ్రూపులో పిల్లల హడావిడి కన్నా తల్లుల హడావిడే ఎక్కువ. అక్కడికీ చెప్పాను, వారానికి ఒకరం చూసుకుందాం అంటే వినరు కదా . అంతా కలవాల్సిందే! ... పంచ వర్ష ప్రణాళికలంత ముఖ్యంగా బట్టలు, నగలు, తిండి గురించిన చర్చలు. జీవితం అంటే ఇంతేనా ..ఇంకేమి లేదా? చర్చలకి అర్హమైన అనేకమైన విషయాలు ఉన్నాయి కదా! "అసలు జీవితం అంటే..." అని ఒకమారు చెప్పబోయాను. నన్నొక గ్రహాంతర వాసిని చూసినట్టు చూశారు. మాములుగా అయితే తూర్పు ఎటు వైపు ఉందో చూసుకుని ఒక దండం పెట్టి, పారిపోయి ఇంటికి వచ్చి పుస్తకాల్లో దూరిపోయేదాన్ని. కానీ దూరంగా ఆనందంగా కేరింతలు కొడుతూ తన తోటి పిల్లల్తో ఆడుతున్న బుడ్డది ముందరి కాళ్ళకి బంధం వేసింది. పిల్లలకి పిల్లలే కదా కావలసింది.

పనంతా ముగించి, పాపని తీస్కుని వెళ్లేసరికి అంతా చేరిపోయారు గెట్ టుగెథెర్ కి. చేరీ చేరగానే ఒక్క గెంతులో పిల్లల జట్టులో చేరిపోయింది నా పిల్ల పిచ్చుక . హాయిగా కౌచ్ లో వాలగానే ప్రశాంతంగా అలా కాసేపు కూర్చోవాలి అనిపించింది. అబ్బె ఎక్కడా , మా వాళ్ళ ఆరాటం ఆపడం బ్రహ్మ తరం కూడా కాదు. మొన్న థాంక్స్ గివింగ్ డీల్స్ లో కొన్న వంట సామాను, వాటి పనితనం, కష్ట సుఖాలు చెప్పేవారు ఒకరైతే . "అవి వేరే షాపులో అయితే ఇంకా చవగ్గా వచ్చేవి, నువ్వు మోసపోయావ్ సుమా!" అని వాళ్ల ఉత్సాహం మీద నీళ్లు జల్లేవారు ఇంకొకరు. మొత్తానికి అందరికీ ఏకగ్రీవంగా ఆమోదయోగ్యం అయిన ఇన్స్టాపాట్ మీద నిల్చింది చర్చ. ఇహ జూసుకోండి, అందులో ఎన్ని వంటలు వండొచ్చు , దేశ విదేశీ వంటల్లో ఏది ఇందులో వండడం ఉత్తమం నుండీ, పెరుగు ఎలా తోడు పెట్టుకోవచ్చు వరకూ మాట్లాడుతూనే ఉన్నారు. కొన్నవాళ్ళు దాని గొప్పని గీతోపదేశం లాగా చెప్తుంటే, కొనని వాళ్ళు, కొనబోయే వాళ్ళు అర్జునిలాగా శ్రద్ధగా వింటున్నారు. లబ లబ మాట్లాడేస్తున్నారు. స్కూల్ లో PT సార్ కి ఉండే శక్తులే గనక నాకు ఉంటే , అందరిని "ఫింగర్ ఆన్ యువర్ లిప్స్ " అని ఆర్డర్ పాస్ చేసి అపార్ట్మెంట్ చుట్టూ మూడు రౌండ్లు వేయించాలి అనిపించింది. ఆ కోరికని బలవంతాన దిగమింగి పిల్లలకి కొత్త ఆట నేర్పిస్తానని చెప్పి పారిపోయా.

కాసేపటికి అలసిన పిల్లలు పడుకుండిపోయారు .పిల్లలు పడుకునే సమయం ఎంతో అపురూపం, అమూల్యం. నిలువెత్తు బంగారం ఇస్తామన్నా వదులుకోలేని సమయం ఇది. నాకంటూ కాస్త తీరిక దొరికే వేళ. నన్నడితే మనకి అర్ధరాత్రి స్వాతంత్ర్యం ఎందుకిచ్చారు అనడిగితే .."అప్పుడైతే పిల్లలు పడుకుంటారు కదండీ ఎంచక్కా, వటపత్ర సాయికి మల్లె ! మనలాంటి గొప్పవాళ్లంతా తీరిగ్గా, ప్రశాంతంగా అలాంటి గొప్ప గొప్ప నిర్ణయాలు తీసుకునేవారు ." అని చెప్తాను. పిల్లని తీస్కుని ఇంటికి వెడదాం అనుకునేలోపు, మా బృందం సినిమా చూద్దామని ప్రపోజ్ చేసారు. ప్రేమ జ్వరం మావాళ్ళనీ తాకింది మరి!

అంతా ఉత్తమ ప్రేమ కథా చిత్ర అన్వేషణలో పడ్డారు. ఈటీవీ వాడు ప్రతీ ఆగష్టు 15న "రోజా" సినిమా వేసి దేశ భక్తి చాటినట్టూ, ప్రతీ నవరాత్రులకీ "ఎన్టీఆర్ పౌరాణికాలు " వేసి భక్తి రసాన్ని పంచినట్టు, మేము కూడా సీజన్ కి తగట్టు నెలకో సినిమా చూసి తద్భావనలు పంచుకోవలెనన్న

మాట. మా వాళ్ళు సినిమా అనగానే గట్టిగా బల్లగుద్ది మరీ "నో" అని అరిచి పారిపోదాం అనుకున్నా. కానీ కొత్త ప్రదేశంలో , పెద్దలు దగ్గర లేని జీవితాల్లో ఈ స్నేహం మా అందరికీ అవసరం. వీళ్లు లేకపోతే ఎలా? డాక్టర్స్ అపాయింట్మెంట్లకి, డ్రైవర్స్ లైసెన్స్ రెన్యువల్ కి, చెప్పా పెట్టకుండా వచ్చే ఎన్నో అవాంతరాలకీ నన్ను ఆదుకునే కామధేనువు, కల్పతరువులు ఈ తల్లులు.

అలా మొత్తానికి ఈ మధ్య కాలంలో వచ్చిన గొప్ప ప్రేమ కావ్యం అని చెప్పబడ్డ "96" అనే సినిమా దగ్గర అందరూ రాజీకి వచ్చారు. తనతో పాటు స్కూల్ లో చదువుకున్న అమ్మాయిని ఇష్టపడే హీరో. కొన్ని కారణాల వల్ల స్కూల్ తర్వాత విడిపోయిన జంట. హీరో కోసం చూసి చూసీ పెళ్లి చేసుకుని పిల్లతో సెటిల్ అయిన హీరోయిను. పెళ్లి పెటాకులు,సంతోషాలు సంబరాలు దూరం చేస్కుని కాలం గడుపుతున్న బ్రహ్మచారి హీరో. ఇరవైయ్యేళ్ల తర్వాత ఓల్డ్ స్కూల్ మేట్స్ గెట్ టుగెదర్ లో కలుసుకున్న జంట. సుఖంగా సెటిల్ అయిన హీరోయిన్ని చూసి తృప్తిగా నిట్టూర్చే హీరో. హీరోకి పెళ్లి సంబంధాలు చూసే హీరోయిను . తాము విడిపోవలసిన కారణం తెలుసుకుని బాధపడి, పరిస్థితులతో రాజీ పడి జ్ఞాపకాల పెట్టెను మూసేసి , ముందుకు సాగిపోయే కథ. సినిమా కాస్త సాగదీసినా నోస్టాల్జియాలో కొట్టుకుపోయి అంతా అలా ట్రాన్స్ లో ఉండిపోయారు. సినిమా సమాప్తం.

మాలోని కొందరు సినీ భావుకులు ఏడ్చారు. మిగతా కొందరు వారిని ఓదార్చారు. ప్రేక్షకులను ఏడిపించడమే ధ్యేయంగా పెట్టుకున్న తమిళ దర్శకులు ఇది చూసి ఆనందించారు. ప్రేమ, స్వచ్ఛమైన ప్రేమ, నిజాయితీ గల ప్రేమ, గొప్ప ప్రేమ ఇలా ప్రేమలో రకాల మీద కాసేపు చర్చ. ప్రేమాభిషేకం లో ఏఎన్ఆర్ ఎప్పుడో చెప్పిన "ప్రేమ త్యాగాన్ని కోరుకుంటుంది" అనే డైలాగ్ ని మళ్ళీ ఈ సినిమాతో "హెన్స్ ప్రూవ్డ్ " అనిపించి తేరుకున్నారు.

ఇంతలో మాలో ఒకరికి అనుమానం వచ్చింది. ఆల్ గర్ల్స్ స్కూల్ అయితే తప్పించి క్రష్ లు, ఫ్యాన్స్ లేకుండా హై స్కూల్ దాటివచ్చిన ఆడపిల్లలు ఉండరు. అలా పాపం మమ్మల్ని మౌనంగా ఆరాధించి, మూగగా ప్రేమించి, గుట్టుగా వెంబడించి ... ఆకర్షణకీ , ప్రేమకీ తేడా తెలీని అయోమయపు అమాయకత్వపు కౌమారంలో మమ్మల్ని ఇష్టపడ్డ మా ఫ్యాన్సు కూడా ఇలాగే ఎక్కడైనా గడ్డాలు పెంచేసుకుని, ఎడారుల్లో తిండి నీరూ నిద్రా మానేసి పెళ్లి పెటాకులు చేసుకోకుండా ఫేస్బుక్ లో చాటుగా మమ్మల్ని ఫాలో అవుతూ, మా అమెరికా జీవితపు విశేషాలు చూస్తూ తృప్తిగా నిట్టూరుస్తున్నారేమో అని!

అంతే అందరికీ దిగులు ముంచుకొచ్చేసింది ... తెలియకుండా ఎంత పాపం చేస్తున్నామో అని ఒకటే బాధపడడం మొదలు పెట్టారు.

ఒక తల్లి వేదన.... "పాపం అనిరుధ్, ఈ సినిమాలో లాగానే రోజూ నేను స్కూల్ కి బయలుదేరి వెళ్ళేటప్పుడు వాళ్ళ ఇంటిమీదినుండి రైల్వే క్రాస్ దాటగానే, నాకోసం ఎదురుచూస్తూ ఉండేవాడు. నేను వాళ్ళ ఇల్లు క్రాస్ చేస్తే కానీ తాను బయల్దేరేవాడు కాదు. మొత్తానికి ఎలాగో టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ కి ముందు మాట్లాడాడు...!"

"ఏమనీ ?"

"తెలుగు నాన్-డీటెయిల్ బారిస్టర్ పార్వతీశం పుస్తకం పోయింది ... నీ పుస్తకం కాసేపు ఇస్తావా అని!"

“ఆ ....”

“ఆ ...అని తీసి పారేస్తారేమిటీ ...అంత చిన్న ఊర్లో అందరూ అందరికీ చుట్టాలే... ఆ రెండు ముక్కలు వినడానికి గుండె దడదడలాడిపోయిందనుకో !”

“సర్లే ..అంతే కదా!

రత్న కిషోర్ అని చిన్నప్పటినుండి నా క్లాసుమేట్ . ఏడో తరగతి వరకు జామ కాయల నుండి, చింతకాయ చాక్లెట్ వరకూ పంచుకుని తినేవాళ్లామా? చిరంజీవి నుండి పవన్ కళ్యాణ్ వరకూ ఫోటో గ్రీటింగ్స్ హ్యాపీ న్యూ ఇయర్ కి పంచుకున్నామా ? అలాంటిది ఏడో తరగతికి రాగానే ఒక్కసారిగా మారిపోయాడు. పిలిస్తే పరిగెట్టేవాడు, చూపులు కలిపేవాడు కాదు. వాలెంటైన్స్ డే కి మాత్రం ఒక రోజా పూవు, మంచ్ చాక్లెట్టు, తొలిప్రేమ పవన్ కళ్యాణ్ గ్రీటింగ్ పట్టుకొచ్చి ఇచ్చేసాడు. ఇస్తే ఇచ్చాడు, చాటుగా ఇవ్వొచ్చు కదా! మా క్లాస్ లో సూర్పనఖ ఒకతి చూసేసింది..టీచర్ కి చెప్పేసింది. అబ్బబ్బ అప్పుడు జరిగిన రచ్చ అంత ఇంతా కాదు. ప్రళయం వచ్చి యుగాంతం ఒచ్చినంత హడావిడి చేసింది మా టీచరు . క్లాస్ అందరి ముందు వాడ్ని చెంప దెబ్బ కొట్టమంది . టీచర్ చెప్పడమూ మనం చెయ్యక పోవడమా .! అందులో అందరి ముందు సీన్ క్రియేట్ చేసాడనే ఉక్రోషం ఒక వైపు .. లాగి పెట్టి ఒక్కటిచ్చా. మా క్లాస్ షారుఖ్ ఖాన్ అనేవారు... పాపం !

"తర్వాత ఏమైంది!"

"మా మేడం అంతటితో ఊరుకుందా, వాళ్ళ అమ్మ నాన్నలకి చెప్పింది. ఆ అబ్బాయిని వేరే ఊరు పంపేశారు. ఇప్పుడు ఎం చేస్తున్నాడో ఏమో! అనవసరంగా కొట్టానేమో!".... ఇంకొకరి బాధ.

“నా టెన్త్ క్లాస్ లో కూడా నా బర్త్ డే నాడు మా ఇంటి ముందు ఒక గిఫ్ట్, రెండు ఎర్ర గులాబీలు పెట్టేసి, మా ల్యాండ్ లైన్ కి ఫోన్ చేసి నాకు విషెస్ చెప్పి, ఇలా గిఫ్ట్ పెట్టాము చూసుకో అని చెప్పాడు ఒక జేమ్స్ బాండ్. మా క్లాస్ మేట్స్ అంతా కలిసి ఒక నెల ఇన్వెస్టిగేట్ చేసి కనుకున్నాం ఆ అజ్ఞాత ప్రేమికుడు పక్క సెక్షన్ అబ్బాయి అని. పాపం ఐదో క్లాస్ నుండి ఇష్టపడుతుంటే, ఇదే ఆఖరి సంవత్సరం ఇక ఇప్పుడు కాకపోతే ఎప్పటికీ చెప్పలేము అని ధైర్యం చేసాట్ట. ”

"తర్వాత "

“ఏముంది.. మా క్లాస్ అబ్బాయిలకి ఈ విషయం తెలిసి పెద్ద గొడవ అంట. ‘మా క్లాస్ పిల్లని ఇష్టపడడానికి నువ్వెవడివి భే ..’ అంటే ‘మా క్లాస్ అబ్బాయిని అడగడానికి మీరెవరురా,’ అని రెండు సెక్షన్ల అబ్బాయిలు దుమ్ములో పొర్లి పొర్లి మరీ కొట్లాడేసుకున్నారు.

ఇలాంటి విషయాలన్నీ చిటికెలో పసిగట్టే మా పీ.టీ సార్ అందరినీ చెవులు పట్టుకోమని మరీ ఎండలో నీల్ డౌన్ చేయించారు. అక్కడితో అంతా గప్ చుప్. పాపం ఆ ఇష్టంతో నన్ను మరచిపోలేక ఏమి చేస్తున్నాడో ఏమో పాపం! ఐదో క్లాస్ నుండి పదో క్లాస్ వరకూ అంటే ఎంత ఘాటు ప్రేమో ఏమో!” ఇంకొకరి నైరాశ్యం.

ఇలా 96 సినిమా పుణ్యమా అని అందరూ తమ తమ స్కూల్ ప్రేమ గాధలను తలచుకుని, ఆ సినిమాలోలాగే ఎక్కడ అప్పటి తమ పిల్ల ప్రేమికులు గడ్డాలు పెంచుకుని దేవదాసులై అవస్థ పడుతున్నారో అని ఒకటే బాధ.

ఇంతలో పిల్లలు లేవడంతో ఆ సభకి కాస్త గ్యాప్ ఇచ్చి పిల్లల హడావిడిలో పడ్డాం. ఇంటికి తిరిగివస్తుంటే ఎంత వద్దనుకున్నా స్కూల్ జ్ఞాపకాలు వెంటపడ్డాయ్. సావాస దోషం అంటే అంతే మరి.

నాకు ఇష్టమని ప్రతి లీజుర్ పీరియడ్ లో 'వాలు కనుల దానా ' పాట పాడే ఉమాకాంతు, రోజుకొక అమ్మాయి సైకిల్ లో గాలితీసేసి ఏడిపించే బ్యాచ్ నుంచి నా సైకిల్ని మాత్రం పువ్వులా కాపాడే కౌషలు, తన ప్రతి బర్త్ డేకి అందరికి మహాలాక్టో చాకొలేట్ ఇచ్చి నాకు మాత్రం డైరీ మిల్క్ ఇచ్చే సాయిరాం, ట్యూషన్ లో నాకోసం సీట్ ఆపే పునీత్, న్యూ ఇయర్ కి లంచ్ బాస్కెట్ లోకి తెలీకుండా వచ్చి పడే గ్రీటింగ్ కార్డులు .... అబ్బో ఎన్నని. అప్పట్లో ఏమీ తెలిసేది కాదు. ఇలాంటి జ్ఞాపకాలన్నీ ప్రతి అమ్మాయికి ఉంటాయి, తలచుకోగానే మనసుకి చక్కలిగింతలు పెడతాయి, వయసుని కాలాన్ని కళ్లాలేసి వెనక్కి లాగేస్తాయి.

అమాయకమైన రోజులవి. కొబ్బరి నీళ్లంత స్వచ్ఛమైన భావనలు. చెరకు రసం అంత తియ్యని స్నేహాలు.

సర్లే గానీ వీళ్ళు కూడా మన సినిమాలో హీరో లాగా భగ్న ప్రేమికులై 'నీ సుఖమే నే కోరుకున్నా ' అని పాడుకుంటూ ఉంటున్నారా ఏంటి?

వెధవ గ్రూపు. మా బ్యాచ్ ని పట్టుకుని తన్నాలి. సుఖంగా ఉన్న ప్రాణానికి లేని పోని ఆలోచనలు అన్నీ అంటగడతారు. ఏదైనా అనుమానపు పురుగు మెదడులోకి ఎక్కితే ఒక పట్టాన కుదురుండదు మనసుకి. అయినా ఇప్పుడు తెలుసుకోవాలంటే ఎంత సేపు, ఫేసు బుక్ ఉందిగా! మా స్కూల్ గ్రూప్ కెళ్ళి వెతికితే సరి, అంతే కదా! , అని ఇంటికొచ్చి ఎన్నటికీ తరగని పనులూ, వంట, చేసుకుని తీరిగ్గా కుర్చునేలోపు .... కుయ్ కుయ్ కుయ్ మని వరసపెట్టి మెసేజిలు గ్రూప్ లో. చెప్పాగా మా వాళ్ళ ఆత్రం ఆపడం బ్రహ్మ తరం కూడా కాదని.

ఏంటా అని చూస్తే...

మదర్ 1: మరేమో డౌట్ క్లియర్ చేసుకుందామని పేస్ బుక్ లోకెళ్ళి వెతికానే, మా అనిరుధ్ ఎంచక్కా పీ.హెచ్. డీ చేసేసి, లెక్చరర్ గా పనిచేస్తున్నాడట. పెళ్లయింది , వాళ్ళావిడ ప్రతి నెలా ఎంగేజ్మెంట్ ఆనివెర్సరీ, వెడ్డింగ్ ఆనివెర్సరీ అని ఫోటోలు అవీ పెట్టి తెగ హడావిడి చేసేస్తోంది.

మదర్ 2: నేనూ చెక్ చేసా ...మా వాడు స్పోర్ట్స్ కోటాలో గవర్నమెంట్ జాబ్ కొట్టేసాడు. మా ఊరి అంబానీ పిల్లనివ్వడానికి తెగ ఉత్సాహపడుతున్నాడట.

మదర్ 3: నాతో మాట్లాడ్డానికే భయపడేవాడు, ఇప్పుడు ఆస్ట్రేలియాలో జాబు, తెల్ల పిల్లతో డేటింగ్, వరల్డ్ ట్రిప్పులూ, అబ్బో వాడి ప్రొఫైల్ అరాచకం అసలు.

మదర్ 4: మా వాడిప్రొఫైల్ ఓపెన్ చెయ్యగానే  డెస్టినేషన్ వెడ్డింగ్ ఫోటోలు, బీచ్ లో పూరి జగన్నాథ్ మూవీ లెవెల్లో ఫోటో షూట్లు, ఇంగ్లీష్ లో కవిత్వాలు. అబ్బో మన ప్రపంచంలో లేడసలు.

ఇవన్నీ చూడగానే ఇంకెందుకు నేను మా వాళ్ళ కోసం వెతికి టైం వేస్ట్ చేసుకోవడం అని వదిలేసా. బాగానే ఉండి  ఉంటారు ఎక్కడ ఉన్నా . నేను, వాళ్ళు ఎప్పుడు తలచుకున్నా పెదవులపై పూచే నవ్వే ఉండాలి అంతే, అని ఫేస్ బుక్  సెర్చ్  బటన్ పై ఉన్న కర్సర్ ని తీసుకెళ్లి లాగౌట్ బటన్ పై పెట్టేసా.

ఇదిగో మావాళ్లు అప్పుడే నార్మల్ మోడ్ లోకి వచ్చేసారు. వాలెంటైన్స్ డేకి ఎవరి భర్తల కోసం వారు ఏమేమి కొనాలో డిస్కషన్ మొదలెట్టేసారు. ఖాళీగా నిమిషం ఉండనీయరు కదా!

ఈ వాలెంటైన్స్ డే నాడు మీకోసం శ్రమపడి మీ ఆనందంలో వాళ్ళ సంతోషం వెతుక్కునే  వారితో మీ ప్రేమను తెలిపి సెలెబ్రేట్ చేసుకోండి మరి.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments